

ర్యాలీలో రంజిత్‌రెడ్డి, బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఫాహీమ్ ఖురేషి



ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

రాజేంద్రనగర్ అభివృద్ధికి కృషి

- కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

నార్సింగ్, మే 6 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఏ-బ్లాక్ అధ్యక్షుడు డప్పు నవీన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ గంధంగూడ నుంచి హైదర్షాకోట్ చౌరస్తా వరకు జరిగింది. ముఖ్యఅతిథులుగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, టీఎమ్ఆర్ ఈఐఎస్ అధ్యక్షుడు ఎండీ ఫాహీమ్ ఖురేషీ, రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అత్యధిక మెజారిటీతో తనను గెలిపించాలని కోరారు. బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో లక్ష ఓట్ల మెజారిటీతో రంజిత్‌రెడ్డి గెలవడం ఖాయమని జోస్యం చెప్పారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో నిరుపేద కుటుంబాలకు 5000 పక్కా ఇళ్లు కట్టిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంజీవ్, ప్రేమ్‌కుమార్, లత ప్రేమ్ గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, టింకురెడ్డి, చంద్రశేఖర్, అస్లాం, రాజిరెడ్డి, సంగారెడ్డి, నరేందర్, మాజీ సర్పంచ్ హరికృష్ణ, సుధాకర్, బొగల శ్రీను, పీఎస్ కుమార్, బొర్రా జ్ఞాన్ అభిలాష్, గంగని అరుణ్, హరికృష్ణ, గణేశ్, ప్రవీణ్, అమీన్, ప్రేమ్, మక్బూల్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

హైదర్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమైనా.. దేశమైన కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని శేరిలింగంపల్లి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆల్విన్‌కాలనీ డివిజన్‌కు చెందిన సాయినగర్ ఈస్ట్, వెస్ట్, శివమ్మ బస్తీ నాయకులు, స్థానికులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్, జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీ కదులుతోంది.. వాడవాడలా కాంగ్రెస్ బలం పెరుగుతోందని, కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని తెలిపారు.



పార్టీలో చేరిన వారితో జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లిలో కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

గచ్చిబౌలి, మే 6 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ గూటికి చేరారు. సోమవారం శేరిలింగంపల్లి డివిజన్ నాయకులు కుమార్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణయాదవ్ ఆధ్వర్యంలో పలువురు నేతలు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మోదీ పాలనలో దేశ రూపురేఖలు మారుతున్నాయ్

- బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

నేరేడ్‌మెట్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనలో భారతదేశం రూపు రేఖలు మారుతున్నాయని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని యాప్రాల్‌లోని మణి ఎన్‌క్లేవ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఉన్న 76 విమానాశ్రయాలు 153 అయ్యాయని, రైల్వే స్టేషన్లు విమానాశ్రయాల మాదిరిగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. దేశంలో పేదల కోసం 12 కోట్ల టాయిలెట్లు కట్టించారన్నారు. జీఎస్టీని అమలు చేసిన గొప్ప నాయకుడు మోదీయని ఆయన కొనియాడారు. ప్రభుత్వం అంటే అభివృద్ధే కాదని, ప్రజల విశ్వాసాలను కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. మల్కాజిగిరి అభివృద్ధి కోసం అనునిత్యం పాటుపడతానని, ఎల్లప్పుడు అందరికి అందుబాటులో ఉంటానని, ఈ ఎన్నికల్లో గెలిపించాలని ఈటల ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణబాబు, నాయకులు రవీందర్‌రెడ్డి, ప్రసన్న, రాజు, సైనికుల కుటుంబాల వారు పాల్గొన్నారు.

ఈటలకు మద్దతుగా కోడలు క్షమిత ప్రచారం

మల్కాజిగిరి: మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా ఆయన కోడలు ఈటల క్షమిత సోమవారం ప్రచారం నిర్వహించారు. బీజేపీ జిల్లా స్పోక్స్‌పర్సన్ సునీల్‌యాదవ్ ఆధ్వర్యం లో ముందుగా పాత మల్కాజిగిరిలోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో క్షమిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఓల్డ్ మల్కాజిగిరిలో ఆమె ఇంటింటికీ వెళ్తూ బీజేపీ అభ్యర్థి ఈటలను కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచార కరపత్రాలను ఓటర్లకు అం దిస్తూ ఆమె ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్, సీనియర్ నాయకులు రాంబాబు, బాలలింగం, వికే మహేష్ ముదిరాజ్, సోమశ్రీనివాస్, బక్కనాగరాజు, లక్ష్మణ్, దన్‌రాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

ఈటలను గెలిపించండి: నర్సింహారెడ్డి

వనస్థలిపురం : మల్కాజిగిరి అభివృద్ధి చెందాలంటే బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మన్సూరాబాద్ డివిజన్‌లోని జడ్జస్‌కాలనీ, ఫేజ్-1, సహార స్టేట్స్, శ్రీరామహిల్స్ కాలనీల్లో బీజేపీ శ్రేణులతో కలిసి కార్పొరేటర్ ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మల్కాజిగిరి మరింతగా అభివృద్ధి చెందాలంటే ఎన్నికల్లో ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలు కాలనీల సంక్షేమ సంఘం నాయకులు శ్రీకాంత్, చంద్రారెడ్డి, అంజయ్యగౌడ్, రామచంద్రారెడ్డి, నాయకులు నాంపల్లి రామేశ్వర్, పాతూరి శ్రీధర్‌గౌడ్, రాజశేఖర్ పాల్గొన్నారు.



ఈటలకు మద్దతుగా ప్రచారం చేస్తున్న కోడలు క్షమిత

కర్మన్‌ఘాట్ ఓల్డ్ విలేజ్‌లో ప్రచారం

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ఓల్డ్ విలేజ్‌లో సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి ఇం టింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కమలం పువ్వు గుర్తుకు ఓట్లేసి మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. దేశంలో మోదీ పాలనకు ప్రజలు తిరిగి స్వాగతిస్తున్నారని, మోదీతోనే దేశం ముందుకు సాగుతుందన్నారు. పేదల కోసం మోదీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సుంకరి రమేష్ గౌడ్, లింగాల దశరథ్‌గౌడ్, చీర గణేష్, మల్లేష్, ఓంప్రకాష్, గిరి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఈటలకు అవకాశం ఇవ్వండి..

మల్లాపూర్: మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు అవకాశం ఇవ్వాలని..పేదల కష్టాలు తొలగిస్తాడని ఆపార్టీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్‌లో సోమవారం మహిళా మోర్చా నాయకులతో కలిసి ఆమె ఈటలను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకులు సబితా, బోదాసు మాధవి, సుజాత, నిర్మల, డివిజన్ నాయకులు నరేందర్‌రెడ్డి, ముత్యం రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

కొత్తపేట : ఎన్నికల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రతకు భరోసానిస్తూ సోమవారం నాగోల్ పోలీసులు వెంకటరమణకాలనీ, శుభంకన్వెన్షన్, జైపురికాలనీ, బండ్లగూడ, ఆనంద్‌నగర్, నాగోల్ చౌరస్తా మీదుగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎస్‌హెచ్‌ఓ పరశురాముడు, ఎస్‌ఐ టీ. శ్రీనివాస్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నగరాభివృద్ధి ఘనత బీఆర్ఎస్‌దే: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, మే 6(ఆంధ్రజ్యోతి): నగరాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్‌దే అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్కాజిగిరి ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ సరూర్‌నగర్ వీఎంహోం మైదానంలో వాకర్స్‌ను ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రహదారులు, బాక్స్‌డ్రైన్‌లు, మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి వంటి ఎన్నో పనులను చేశామన్నారు. ఈనెల 13న జరగనున్న పోలింగ్‌లో కారు గుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని ఎంపీగా గెలిపించాలని ఆయన వాకర్స్‌ను కోరారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బేర బాలకిషన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



సరూర్‌నగర్ వీఎంహోం మైదానంలో వాకర్స్‌తో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

అల్వాల్: మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా సోమవారం అల్వాల్ డివిజన్‌లో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె ప్రజలను కోరారు. గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మల్లేష్‌గౌడ్, హనుమంత్, మల్లేష్, గిరి, లింగారెడ్డి, యాదగిరిగౌడ్, మహేశ్, మధు, రాజేందర్, లింగారెడ్డి, నందిని, శ్రీమతిరెడ్డి, వీణ, సింధు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే జవహర్‌నగర్ అభివృద్ధి

జవహర్‌నగర్: 20 ఏళ్లలో జరగని అభివృద్ధి బీఆర్ఎస్ వచ్చిన 10ఏళ్లలో జరిగిందని జవహర్‌నగర్ మాజీ మేయర్ మేకల కావ్య అన్నారు. మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపుకోసం జవహర్‌నగర్‌లోని పలు డివిజన్లలో బీఆర్ఎస్ శ్రేణులు, కార్పొరేటర్లతో కలిసి మాజీ మేయర్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధిచెప్పాలని జవహర్‌నగర్‌వాసులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా నాయకులు పాల్గొన్నారు.

ఈవీఎంల కమిషనింగ్, సింబల్ లోడింగ్

- స్ట్రాంగ్‌రూంలను పరిశీలించిన పరిశీలకురాలు

ఎల్బీనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మల్కాజిగిరి నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంల కమిషనింగ్, సింబల్ లోడింగ్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నారు. ఈవీఎంల కమిషనింగ్, సింబల్ లోడింగ్, పోస్టల్ బ్యాలెట్‌ను సోమవారం మల్కాజిగిరి పార్లమెంట్ సాధారణ పరిశీలకురాలు డాక్టర్ ప్రియాంక శుక్ల పరిశీలించారు. డీఆర్‌సీ కేంద్రం అయిన ఇండోర్ స్టేడియంలో ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన స్ట్రాంగ్ రూంను కూడా ఆమె పరిశీలించారు. వారి వెంట అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పంకజ, నోడల్ అధికారులు ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



డీఆర్‌సీ సెంటర్‌ను సందర్శిస్తున్న జనరల్ అబ్జర్వర్ డాక్టర్ ప్రియాంక శుక్ల

పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

హయత్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూర్, కొహెడా, బ్రాహ్మణపల్లి, మునగనూరు, తుర్కయంజాల్ పోలింగ్ స్టేషన్లలో అవసరమగు ఏర్పాట్లను సోమవారం తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. తగిన ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. విధుల కోసం వచ్చే సిబ్బందికి అవసరమగు తాగునీరు, టాయిలెట్స్, టెంట్‌లు, విద్యుత్ మరమ్మతులు చేయాలని కోరారు. మే 13వ తేది వరకు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, బిల్ కలెక్టర్ ఎల్లయ్య, నరేష్, జగదీష్, మహేష్, మురళీ, నగేష్ పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి

మాట తప్పని నేత రేవంత్‌రెడ్డి: మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎల్బీనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): మాట ఇస్తే తప్పని నేత సీఎం రేవంత్‌రెడ్డి అని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. కర్మన్‌ఘాట్‌లోని వేడుక కన్వెన్షన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేయగానే నిధులతో కూడిన ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. ఆర్యవైశ్యులు కాంగ్రెస్‌కి అండగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంకటేశం, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ చైర్మన్ రఘుమారెడ్డి, జైపాల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, కిరణ్‌కుమార్, రమాకాంత్, కొత్త రవికుమార్, ఉప్పల శ్రీను, వెంకటేశ్, ఆలంపల్లి శ్రీనివాస్, శివాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

ఆస్పత్రి భవనంపై నుంచి కింద పడిన వృద్ధురాలు

చాదర్‌ఘాట్, మే 6(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై కేర్ ఆస్పత్రి మలకపేటలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు ఆస్పత్రి భవనంపై నుంచి కిందపడి తీవ్ర గాయాలకు గురైంది. ఉమ్మాపూర్ గ్రామానికి చెందిన ఎల్లమ్మ(80) ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కేర్‌ఆస్పత్రి మలకపేటలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఆమెకు వైద్య చికిత్స జరుపుతున్న వైద్యులు శస్త్ర చికిత్స చేయాలని సూచించారు. సోమవారం ఆస్పత్రి భవనంపై నుంచి వృద్ధురాలు ఎల్లమ్మ కిందపడడంతో తీవ్రంగా గాయపడింది. ఘటన జరిగిన తర్వాత ఆస్పత్రి వర్గాలు చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే ఇన్‌పేషంట్ ఎల్లమ్మ ఆరోగ్య పరిస్థితిని మాత్రం వైద్యులు వెల్లడించడం లేదు. వృద్ధురాలు ఎల్లమ్మ ఆస్పత్రి భవనం పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడిందా లేక ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందా అనే విషయాన్ని చాదర్‌ఘాట్ పోలీసులు ధ్రువీకరించలేదు.

వలస కార్మికుడు అదృశ్యం



సైదాబాద్: బతుకుదెరువుకు నగరానికి వలస వచ్చిన మధ్యప్రదేశ్‌కు చెందిన వలస కార్మికుడు కనిపించకుండా పోవడంతో సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం చింద్వారా ప్రాంతానికి చెందిన విశ్వకర్మ కమలేష్(35) అదే ప్రాంతానికి చెందిన బంధువు రాజుతో కలిసి వారం రోజుల క్రితం నగరానికి జీవనోపాధికి వచ్చి సైదాబాద్ ఖాజాబాగ్‌లో నివాసముంటున్నారు. ఈనెల 1న రాజు పనికి పోగా కమలేష్ ఇంటి వద్దనే ఉన్నాడు. రాజు పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి రాగా కమలేష్ కనిపించలేదు. స్వగ్రామానికి వెళ్లవచ్చని భావించారు. కానీ ఊరికి రాలేదని కుటుంబసభ్యులు తెలపడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో వెదికారు. అయినా ఆచూకీ లేకపోవడంతో సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారిపై అదుపుతప్పి డీసీఎం బోల్తా

- కొద్ది సేపు ట్రాఫిక్‌కు అంతరాయం

అబ్దుల్లాపూర్‌మెట్, మే 6(ఆంధ్రజ్యోతి): అదుపుతప్పిన డీసీఎం అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద విజయవాడ జాతీయ రహదారిపై బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి పప్పు దినుసుల లోడ్‌తో విజయవాడ వైపునకు వెళ్తున్న డీసీఎం సోమవారం ఉదయం 6గంటల సమయంలో అబ్దుల్లాపూర్‌మెట్ హెచ్‌డీఎఫ్‌సీ వద్దకు చేరుకోగానే అదుపుతప్పింది. దాంతో డీసీఎం జాతీయ రహదారిపై బోల్తాపడింది. రోడ్డుకు అడ్డంగా పడడంతో జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అక్కడికి చేరుకుని క్రేన్ సహాయంతో డీసీఎంను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఎవ్వరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

రాహుల్‌ని పీఎం చేయాలంటే కష్టపడి పనిచేయాలి

- మల్కాజిగిరి కాంగ్రెస్ ఇన్‌చార్జి జ్యోతిమణి సెన్నిమలై

వనస్థలిపురం, మే 6(ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలంటే కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని, దక్షిణాది రాష్ట్రాల నుంచి మిత్రపక్షాలతో కాకుండా సొంతంగానే 60ఎంపీ స్థానాలు గెలుపొందాల్సిన అవసరం ఉందని మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి, ఎంపీ జ్యోతిమణి సెన్నిమలై పేర్కొన్నారు. ఎల్బీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఎల్బీనగర్ నియోజవర్గం కాంగ్రెస్ ముఖ్య నేతలు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అడ్వైజరీ కమిటీ ప్రతినిధులు, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌తో కలిసి ఆమె సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిమణి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఐదు గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. గ్యారెంటీ కార్డును ప్రతి ఇంటికి అందించి తిరిగి రిసిప్టును తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ బూత్‌కు ఐదుగురు మహిళలు, ఐదుగురు యువకులతో కూడిన కమిటీ వేయాలన్నారు. మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ మల్కాజిగిరిలో పార్టీ గెలవడం ఎంతో ప్రాధాన్యతతో కూడుకున్నదన్నారు. అందులో భాగంగా ఎల్బీనగర్ నుంచి భారీ మెజార్టీని అందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జ్యోతిమణి, మధుయాష్కీగౌడ్ సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, కార్పొరేటర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, సుజాతనాయక్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జ్యోతిమణి సెన్నిమలై

9 నుంచి అష్టలక్ష్మి ఆలయ బ్రహ్మోత్సవాలు

ఎల్బీనగర్, మే 6(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురం వాసవీకాలనీలోని అష్టలక్ష్మి ఆలయ 28వ బ్రహ్మోత్సవాలు ఈ నెల 9 నుంచి 15 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ సోమ సురేష్ తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్రహ్మోత్సవ ఆహ్వానపత్రికను ధర్మకర్తలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగే విధంగా అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. సౌకర్యాల విషయంలో భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దాదాపు 350మంది వలంటీర్లు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మాడవీధుల్లో కళాకారుల మధ్య వాహన సేవలు ఉంటాయన్నారు. 10న గరుడ ప్రసాదం ఇవ్వడం జరుగుతుందన్నారు. భక్తులకు అన్నప్రసాదం, మంచినీరు, మజ్జిగ పంపిణీకి ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అష్టలక్ష్మి ఆలయ ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, వైస్‌చైర్మన్ నాగమల్ల శ్రవణ్‌కుమార్, మాజీ చైర్మన్ మేడం సుధాకర్‌గుప్తా, బ్రహ్మోత్సవాల కన్వీనర్ బొగ్గారపు రవీందర్, చిలుక ఉపేందర్‌రెడ్డి, దాచేపల్లి శ్రీనివాస్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఆలయ ధర్మకర్తలు

ఆర్థిక లావాదేవీలతో ఇరు వర్గాల దాడి..

- మద్యం మత్తులో పండ్ల షాపును తగలబెట్టిన మరోవర్గం
- ప్రతీకారంతో కత్తితో దాడి.. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స
- పోలీసుల అదుపులో నిందితులు

వనస్థలిపురం, మే 6(ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావాదేవీలతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడిచేసుకుని, మద్యం మత్తులో మరో వర్గం వ్యక్తులు పండ్ల షాపుపై దాడి చేసి, పండ్ల షెడ్‌లను తగలబెట్టిన సంఘటన ఆదివారం రాత్రి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రాయన్ గుట్టకు చెందిన ఫషీ, అహ్మద్‌ఖాన్, సాదిక్‌అలీ, మహబూబ్‌పాషా, బాబా ఫక్రుద్దీన్‌లు బీఎన్‌రెడ్డినగర్‌లోని సాగర్ కాంప్లెక్స్ సాగర్ రహదారి ఫుట్‌పాత్‌లపై పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్‌కు చెందిన సబావత్ రాజు(24) సాదిక్ అలీ మధ్య ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. గతంలో సాదిక్ అలీ రాజు వద్ద 10వేలు నగదును తీసుకుని ఇటీవల రాజుకు రూ.5వేలు ఇవ్వగా, మరో రూ.5వేలు బాకి ఉన్నాడు. అందులో భాగంగా రాజు ఆదివారం సాయంత్రం సాదిక్ అలీ షాపు వద్దకు వచ్చి తనకు ఇవ్వాల్సిన రూ.5వేలు ఇవ్వాలని అడగడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో సాదిక్ అలీతో పాటు ఫషీ, అహ్మద్‌ఖాన్, మహబూబ్ పాషా, బాబా ఫక్రుద్దీన్‌లు రాజును చితకబాదారు. వెంటనే అక్కడ నుంచి పరిగెత్తుకుంటు వెళ్లిన రాజు తనకు తెలిసిన నలుగురు వ్యక్తులను వెంటతీసుకుని పండ్లవ్యాపారులపై దాడికి దిగారు. ఈ క్రమంలో సాధిక్ అలీ తన షాపు పక్కన ఉన్న కొబ్బరి బొండాలు కోసే కత్తితో బలంగా రాజు తలపై బలంగా కొట్టాడు. దీంతో మరింతగా కోపంతో రగిలిపోయిన రాజు అనుచరులు పండ్ల షాపును తగలబెట్టారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆపివేశారు. సమాచారం అందుకున్న పోలీసులు తీవ్ర గాయలైన రాజును సమీపంలోని బ్యంగి హాస్పటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. రాజుపై దాడిచేసిన ఐదుగురు పండ్ల వ్యాపారులపై బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా దాడికి పాల్పడిన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న సబావత్ రాజు

పోలింగ్ బూత్‌ల ప్రాంగణం ఇలా.. ఎన్నికల రోజు ఎలా..?

- నాదర్‌గుల్ వార్డు కార్యాలయం వద్ద అస్తవ్యస్త పరిస్థితి
- కార్యాలయం ముందు భాగం తమదేనంటూ కబ్జాకు యత్నం
- పట్టించుకోని మునిసిపల్, రెవెన్యూ అధికారులు
- పోలింగ్ రోజు తిప్పలు తప్పవని స్థానికుల ఆందోళన

సరూర్‌నగర్, మే 6(ఆంధ్రజ్యోతి): మరో వారం రోజుల్లో ఎంపీ ఎన్నికల పోలింగ్ జరుగనుండగా.. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ వార్డు కార్యాలయం(పాత గ్రామ పంచాయతీ కార్యాలయం) వద్ద మాత్రం విచిత్ర పరిస్థితి నెలకొన్నది. ఈ కార్యాలయంలో 275, 279 నంబర్లతో రెండు పోలింగ్ బూత్‌లు ఉన్నప్పటికీ, అక్కడ జరుగుతున్న కబ్జా తంతును మాత్రం అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. గతంలో ఇక్కడ పోలింగ్ నిర్వహించినప్పుడు కార్యాలయం ముందు భాగం ఖాళీగా, విశాలంగా ఉండేది. దాంతో ఓటర్లు క్యూలో నిల్చోవడానికి, అధికారులు, పోలింగ్ సిబ్బంది వాహనాలు నిలుపడానికి అనువుగా ఉండేది. అయితే ఇటీవల ఓ మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు సదరు స్థలం తమదేనంటూ సగానికి పైగా ఖాళీ స్థలాన్ని ఆక్రమిస్తూ ఏకంగా పునాది తీసి పిల్లర్లకు స్టీల్(ఇనుప చువ్వలు) సైతం వేసేశారు. దాంతో అక్కడ ఏర్పాటు చేసే పోలింగ్ బూత్‌ల వల్ల ఓటర్లకే కాకుండా అధికారులకు, సిబ్బందికి సైతం తిప్పలు తప్పేలా లేవు. దశాబ్దాలుగా అక్కడ పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు వాటిని మార్చే పరిస్థితి కూడా లేదు. కాగా ఇటీవల మునిసిపల్, రెవెన్యూ సిబ్బంది పోలింగ్ బూత్‌లను సందర్శించినప్పటికీ అక్కడి కబ్జాపై స్పందించకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ నిర్వహణ సవ్యంగా జరగాలంటే అక్కడి ఆక్రమణను పూర్తిగా అడ్డుకుని, స్థలం మొత్తాన్ని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని వారు కోరుతున్నారు.



బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ వార్డు కార్యాలయం ఎదుట గల ఖాళీ స్థలంలో పునాది తవ్వి స్టీల్ వేసిన దృశ్యం



నాదర్‌గుల్ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్